క్లుప్తంగా

సన్మానం



మహాముత్తారం: మండలంలో ఎంపీఓగా విధులు నిర్వహించిన ఉపేంద్రయ్యతో పాటు స్థంబంపల్లి(పీపీ), యత్నారం పంచాయతీ కార్యదర్శులు సంపత్, లక్ష్మి ఇటీవల బదిలీ అయ్యారు. వీరికి బుధవారం మండల కేంద్రంలో మండల అధికారులు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, ఏపీఓ కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోచమ్మ తల్లికి మొక్కుల చెల్లింపు

గణపురం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని పోచమ్మ తల్లికి విశ్వబ్రాహ్మణ కుల పెద్దల ఆధ్వర్యంలో బుధవారం మొక్కులు ప్రారంభమయ్యాయి. సాంప్రదాయంగా అమ్మవారికి విశ్వబ్రాహ్మణులు తొలి మొక్కులు చెల్లించడంతో పాటు పూజ కార్యక్రమాలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా ఆలయ శుద్ధి చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పట్టువస్త్రాలతో అలంకరించి మొక్కులు చెల్లించారు. నేటి నుంచి గ్రామస్తులు బోనాలు సమర్పించుకుంటూ మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు పూజారులు చిలుమోజు పెద్దరాజు, శంకర్, భాస్కర్, రాజు, కిరణ్, బాలజీప్రమీల, వీరలక్ష్మి, రాధిక, సరోజన తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో కూడిన భోజనం అందించాలి

కాటారం: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం అందించాలని తహసీల్దార్ నాగరాజు సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల అప్‌గ్రేడ్ కళాశాలను బుధవారం తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల ఆవరణ, పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా తీశారు. వంటగది, వంట సామగ్రి, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. నాసిరకం కూరగాయలు, వంగ సామగ్రి వినియోగించవద్దని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తాజాగా వండిన పదార్థాలను మాత్రమే ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చూసుకోవాలని ప్రిన్సిపాల్‌కు తెలిపారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ వెంకన్న ఉన్నారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్ట్



మహాముత్తారం: గంజాయి సేవిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ నాగార్జున్‌రావు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సీఐ వివరాలు వెల్లడించారు. కొంత మంది యువకులు మండలంలోని జీలపల్లి, మాదారం గ్రామాల మధ్యగల అటవీ ప్రాతంలోని బ్రిడ్జి వద్ద గంజాయి సేవిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై మహేందర్‌కుమార్ సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లినట్లు తెలిపారు. అక్కడ పరిశీలించగా జీలపల్లి గ్రామానికి చెందిన తైనేని రాంబాబు, కొర్లకుంట గ్రామానికి చెందిన లావుడ్యతిరుపతి, వాంక్‌డోత్ వంశీలను అదుపులోకి తీసుకొని విచారిచగా వారివద్ద 435గ్రాముల ఎండు గంజాయిని లభ్యం అయిందన్నారు. గంజాయిని సీజ్‌చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బాలికను వేధించిన వ్యక్తి ..

మహాముత్తారం: ప్రేమ పేరుతో ఓ బాలికను వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. కాటారం సీఐ నాగార్జున్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఓదాల గ్రామానికి చెందిన నల్లపు రజినీకాంత్ అనే యువకుడు మండల కేంద్రానికి చెందిన బాలికను ప్రేమపేరుతో వేధింపులకు గురి చేస్తున్నాడని బాలిక తండ్రి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు రజినీకాంత్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామ శివారులో 80 క్వింటాళ్ల రేషన్ బియ్యం లోడుతో ఉన్న డీసీఎం వ్యాన్‌ను టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్‌రావు సిబ్బందితో కలిసి బుధవారం స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీసీఎం వ్యాన్‌లో రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారనే సమాచారం మేరకు పట్టుకున్నామని తెలిపారు. అనంతరం వ్యాన్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు కోదారి రవి, కోమ్ము రవిలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్లపైనే మురుగు నీరు!



యామన్‌పల్లిలో రోడ్డుపై నిలిచిన మురుగు



బోర్లగూడెంలో రహదారిపై నుంచి పారుతున్న మురుగు

- పల్లెల్లో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మహాముత్తారం: పల్లెలే ప్రగతికి సోపానాలుగా చెపుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పచ్చదనం పరిశుభ్రత పేరుతో రూ.కోట్లాది నిధులు ఖర్చు చేశామని అధికారులు చెప్తున్న గ్రామాల్లో మాత్రం పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం పంచాయతీకి ఒక ప్రత్యేకాధికారిని నియమించారు. దీంతో అదనపు బాధ్యత కావడంతో తూతూ మంత్రంగా విధులు న్విహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని ప్రధాన రహదారులతో పాటు యామన్‌పల్లి, నిమ్మగూడెం, బోర్లగూడెం, నర్సింగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పీకుడుపల్లి గ్రామాల్లోని రహదారుల్లో గతంలో సిమెంట్ రోడ్లు నిర్మించారు కానీ వాటికి సైడ్ కాల్వలు నిర్మించలేదు. దీంతో మురుగు రోడ్లపై పారుతోంది. రోడ్లపై నీరు నిలిచి బురుదమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగలేకపోవడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు జ్వారాల బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికై న సంబంధిత అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్ల వద్ద సైడ్ కాల్వల నిర్మాణం చేపట్టి, పారిశుద్ధ్య పనులు నిర్వహించి తమకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రావును వివరణ కోరగా పారిశుద్ధ్యం లోపించిన గ్రామాల్లో కార్మికులచే పనులు చేపడతామని తెలిపారు.



రోడ్డుపై నిలిచిన నీరు

సైడ్ కాల్వలు నిర్మించాలి



గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించారు కానీ వాటి పక్కకు నీరు వెళ్లడానికి సైడ్‌కాల్వలు నిర్మించలేదు. దీంతో వర్షం కురిసినప్పుడల్ల నీరు రోడ్డుపై నుంచి పారి దుర్వాసన వస్తోంది. అదే విధంగా ద్విచక్రవాహన దారులు పడిపోతున్నారు. ఇప్పటికై న సైడ్‌కాల్వల నిర్మాణం చేపట్టి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలి.

– ఓల్లాల రమేశ్, బోర్లగూడెం

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా కల్వర్టు



మండలంలోని రామకిష్టాపూర్(టీ) శివారులోని టేకులకుంట వద్ద గల లోలెవల్ కల్వర్టు ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. నిత్యం మండలం నుంచి చిట్యాల వైపునకు వెళ్లే భారీ వాహనాలతో కల్వర్టు ధ్వంసం అయింది. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు కల్వర్టు గుంతలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం కురిసిన ప్రతీసారి కల్వర్టు గుంతలో భారీగా నీళ్లు నిలువడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. కల్వర్టు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

– టేకుమట్ల

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : అవినాష్, ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జ్ ఏఈ
ఫోన్‌నంబర్ : 9440818685

గడ్డిమందు స్వాధీనం

కాటారం: బిల్లులు లేకుండా మహారాష్ట్ర నుంచి కాటారం మీదుగా తరలిస్తున్న గడ్డిమందు(గ్లెఫోసెట్)ను మండల కేంద్రానికి సమీపంలోని బొప్పారం క్రాస్ వద్ద బుధవారం సాయంత్రం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మ్యాక అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు గడ్డిమందు సరఫరా చేస్తున్నారనే సమాచారం మేరకు బొప్పారం క్రాస్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఏలాంటి బిల్లులు లేని 80 లీటర్ల గడ్డిమందు బాటిల్స్‌ను సీజ్ చేసినట్లు వీటి విలువ మహారాష్ట్ర మార్కెట్ విలువ ప్రకారం రూ.60 వేల వరకు ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గడ్డిమందు రవాణా చేస్తున్న మహాముత్తారం మండలానికి చెందిన రణదీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

టేకుమట్ల: మండల కేంద్రంతో పాటు, మండలంలోని రామకిష్టాపూర్(టి)లో బుధవారం బీజేపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేశెట్టి గోపాల్, గుర్రపు నాగరాజు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో హర్ ఘర్ తిరంగ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన హర్ ఘర్ తిరంగ అన్ని కుల, మతాలు కలిసి ఉండాలనే లక్ష్యంతో కొనసాగించినట్లు తెలిపారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బట్టు రవి, బూత్ అధ్యక్షులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జిల్లా వ్యవసాయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాకర్లపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పొనగల్లు గ్రామం వరకు రూ.1.50 కోట్లతో బీటీ రోడ్డు రెన్యువల్ పనులకు శంకుస్థాపన చేశారు. తహసీల్దార్ శ్వేత, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజ్ కిష్టయ్య, శాస్త్రవేత్తలు జలపతిరావు, ఉమారెడ్డి, ఎంపీఓ రాంప్రసాద రావు, ఆర్ఐ నరేష్‌కుమార్, జిల్లా నాయకులు సంపత్‌రావు, మోడెం ఉమేష్ గౌడ్, సూదనబోయిన ఓంప్రకాష్, ములకనూరి భిక్షపతి, పున్నం రవి, దుగ్యాల రాజేశ్వర్ రావు, అమ్ముల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తాం..

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిలో నిర్మించిన గెజిటెట్ అధికారుల కమ్యూనిటీ భవనాన్ని కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జెడ్పీ కార్యాలయం, పదవి విరమణ చేసిన ఉద్యోగులకు, ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మమాట్లాడుతూ.. టీజీఓ కమ్యూనిటీ భవనం నిర్మించుకోవడం చాలా సంతోషమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, గెజిటెడ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా టీజీఓ అధ్యక్షుడు శామ్యూల్, రాష్ట్ర నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్‌శర్మ

బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

భూపాలపల్లి మండలం నేరేడుపల్లి గ్రామం నుంచి చిట్యాల మండలం నైన్‌పాక గ్రామం వరకు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.3.20 లక్షలతో నిర్మించనున్న నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట గ్రామ కమిటీ నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవాలి

రేగొండ: విద్యార్థులు క్రమశిక్షణతో విజ్ఞానాన్ని పెంచుకుని, భావి భారత శాస్త్రవేత్తలుగా తయారు కావాలని నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక 5వ జిల్లా మహాసభలను మండల కేంద్రలోని వాణి విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూమిపై ఉన్న జీవజాలంలో మానవుడి మేధస్సుతో ఇతర జీవుల కంటే మెరుగైన జీవనం సాగిస్తున్నాడని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి హిమబిందు, విజ్ఞాన వేదిక సైన్స్ అండ్ టెక్నాలజీ కన్వీనర్ వేల్పుల రాజు, పాఠశాల కరస్పాండెంట్ గాజర్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్రాంత ఆచార్యులు లక్ష్మారెడి

నిత్యావసర సరుకుల పంపిణీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పెద్దంపేట గ్రామంలో తండ్రి, కుమారుడు బీసుల లస్మయ్య, కృష్ణంరాజు ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని స్వయం కృషి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహకులు వెన్నపురెడ్డి సురేష్, చల్ల దేవేందర్ రెడ్డి, ఎల్లంకి శశికుమార్‌లు బుధవారం పరామర్శించి 75కేజీల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ కొట్టే సతీశ్, హైమద్, కురుసం సాగర్, గడ్డం రాజుగౌడ్ పాల్గొన్నారు.

సూరారంలో..

సూరారం గ్రామానికి చెందిన జర్నలిస్టు తూడిచెర్ల దుర్గయ్య తండ్రి తూడిచెర్ల పెద్ద లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చల్ల రమేష్‌రెడ్డి పరామర్శించి వారికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు తులసి మహేశ్, మాజీ సర్పంచ్ చుక్క మల్లయ్య, సీనియర్ నాయకులు ఓడేటి రాజిరెడ్డి, రత్న రాజిరెడ్డి, చల్ల మహేశ్, జిల్లెల నాగరాజు, కావేటి రాజేశం, నాగుల అశోక్, మాజీ వార్డు సభ్యులు సంధ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెద్దంపేటలో సరుకులు అందజేస్తున్న సభ్యులు

సభ్యత్వ నమోదు చేపట్టాలి

కాటారం: మండలంలోని ప్రతీ గ్రామంలో అధిక సంఖ్యలో యూత్ కాంగ్రెస్ సభ్యత్వ నమోదు చేపట్టాలని మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ విభాగం రాష్ట్ర నాయకుడు ఎర్రవెల్లి విలాసరావు సూచించారు. మండలంలోని ధన్వాడలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్వగృహంలో బుధవారం నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ.. యూత్ కాంగ్రెస్ నాయకులు, యు వకుల సభ్యత్వాలు నమోదు చేయాలని తెలిపారు. అలాగే యూత్ రాష్ట్ర అధ్యక్షుడి స్థానానికి అభ్యర్థిగా జక్కిడి శివచరణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బండ కిశోర్‌రెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా అవినాష్, మంథని నియోజకవర్గ అధ్యక్షుడిగా సందీప్‌లను మంత్రి శ్రీధర్ బాబు, యూత్ నాయకుడు శ్రీనుబాబు బలపర్చినట్లు తెలిపారు. విరి విజయానికి నాయకులు కృషి చేయాలన్నారు. వంశీవర్ధన్‌రావు, చీర్ల తిరుపతిరెడ్డి, కుంభం రమేశ్‌రెడ్డి, చిటూరి మహేశ్, భూపెల్లి రాజు, ఉమాశంకర్ ఉన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

బాధ్యతల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ రమణారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా ఇక్కడ విధులు నిర్వర్తించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యాంప్రసాద్ బదిలీ కాగా ఆయన స్థానం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమణారావు బదిలీపై వచ్చారు.

ఉత్తమ సింగరేణియన్లు వీరే..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని వివిధ విభాగాల్లో ఉత్తమ ఉద్యోగుల(ఉత్తమ సింగరేణియన్లు)ను ఎంపిక చేశారు. సంస్థ వ్యాప్తంగా 12మందిని గుర్తించగా వారికి కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో గురువారం జరిగే స్వాతంత్ర్య దినోత్సవంలో సీఎండీ బలరామ్ ప్రశంసపత్రాలు అందజేసి సన్మానిస్తారు. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిలో బొబ్బల మల్లారెడ్డి(ఈపీ ఆపరేటర్, కేటీకే ఓసీ భూపాలపల్లి ఏరియా), అబ్దుల్ రజాక్(ఈపీ ఆపరేటర్, ఓసీపీ, ఆర్జీ-3 ఏరియా), బానోత్ కార్మిక్(ఫోర్మెన్ ఆటో/మెకానిక్, ఆండ్రియాల ప్రాజెక్ట్), సల్లా భిక్షపతి(ఈపీ ఆపరేటర్, జీడీకే ఓసీపీ-3, ఆర్జీ-2 ఏరియా), ఉబుతా బుచ్చయ్య(రాంకర్/ షటిల్ కార్ ఆపరేటర్ జీడీకే-11, ఆర్జీ-1), ఎంజారపు విజయ్‌కుమార్(ఈపీ పిట్టర్, ఖైరీగుడ ఓసీపీ, బెల్లంపల్లి ఏరియా), పొట్లా రాజలింగయ్య (హెడ్ ఓవర్‌మెన్, శాంతిఖని, మందమర్రి ఏరియా), కర్రె బీరయ్య(ఎస్‌డీఎల్ ఆపరేటర్ ఆర్కే6 ఇంక్‌లైన్, శ్రీరాంపూర్ ఏరియా), షేక్ మైబాషా(ఎలక్ట్రీషియన్, వర్క్‌షాపు మణుగూరు ఏరియా), కొంగర వెంకటేశ్వర్లు(ఫిట్టర్, కేటీసీ, ఇల్లందు ఏరియా), ఐనవెల్లి శ్రీనివాస్ రావు(ఫిట్టర్, కిష్టారం ఓసీ, కొత్తగూడెం ఏరియా)తో పాటు మహమ్మద్ నిసారుద్దీన్(సీనియర్ అసిస్టెంట్, ఎస్‌టీపీపీ) ఉన్నారని జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) సామ్యేల్ సుధాకర్ వెల్లడించారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

చిట్యాల: చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఉమ్మడి వరంగల్ జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బడి మధ్యలో మానేసి ఇంటి వద్దే ఉండే వారికి ఓపెన్ టెన్త్, ఇంటర్ చదువుకోవడం సువర్ణ అవకాశం అన్నారు. పూర్తి వివరాలకు మండల ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ ఉపాధ్యాయుడు బుర్ర సదయ్యను లేదా సెల్ నంబర్ 94900 05525కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం రఘుపతి, ఉపాధ్యాయులు భాస్కర్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్లో ప్రవేశాలకు సంబంధించిన వాల్ పోస్టర్, బ్రోచర్‌ను అసిస్టెంట్ కో ఆర్డినేటర్ కుమారస్వామి, స్టడి సెంటర్ కోఆర్డినేటర్ ప్రధానోపాధ్యాయుడు విజయపాల్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సార్వత్రిక విద్య ఎంతో సులభమైనదని అన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మహిళలు, వివిధ వృత్తి పనుల వారు తమకు ఇష్టమైన సబ్జెక్టులను ఎంపిక చేసుకొని ఆదివారాలు, సెలవు దినాల్లో తరగతులకు హాజరై కోర్సు పూర్తి చేయవచ్చన్నారు. అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లను సంప్రదించి వారి సూచనల మేరకు ఆన్‌లైన్‌లో సంబంధిత రుసుము చెల్లించి ప్రవేశాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

రేగొండ: విద్యార్థులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ కొమురయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే వసతి గృహంలో మండల వైద్యాధికారిని డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరుచూ వచ్చే జ్వరం, తలనొప్పి వంటి వాటిని నిర్లక్ష్యం చేయరాదన్నారు. డాక్టర్ విష్ణు, వర్ధన్, అస్మా ఫాతిమాతో పాటు తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ కరెంట్ పోల్‌ను ఢీకొట్టిన లారీ



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి–పరకాల జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారు జామున రోడ్డు పక్కనే ఉన్నటువంటి హైటెన్షన్ కరెంట్ పోల్‌ను లారీ ఢీ కొట్టిన సంఘటన కుందూరుపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి నుంచి చెల్పూర్ వైపు ముందు వెళ్తున్న ఇసుక లారీని వెనుకాల వైపు నుంచి వస్తున్న బొగ్గు లారీ ఢీ కొట్టింది. దీంతో ఇసుక లారీ రోడ్డు పక్కకు దుసుకువెళ్లి హైటెన్షన్ కరెంట్‌పోల్‌ను ఢీ కొట్టినట్లు తెలిపారు. అర్ధరాత్రి రావడంతో ఇతర వాహనాలు లేకపోవడం, హైటెన్షన్ కరెంట్ వైర్లు తెగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్లకు గాయాలైనట్లు తెలిపారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.